క్లుప్తంగా

26న మూడు పుస్తకాల ఆవిష్కరణ సభ

ప్రొద్దుటూరు : ఈనెల 26న ఉదయం 10 గంటలకు తెలుగు అధ్యాపకులు డాక్టర్ దస్తగిరి అధ్యక్షతన మూడు పుస్తకాల ఆవిష్కరణ సభను నిర్వహిస్తున్నట్లు మిత్రజ్యోతి సాహితీ సాంస్కృతి సంస్థ, విరసం, జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులు ప్రకటించారు. గురువారం వారు సభ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక రోటరీ క్లబ్‌లో నిర్వహించే సభలో ఆస్మానీ, సిక్స్‌ప్యాక్ రాముడు, రెయిన్‌బో కథల పుస్తకాలను ఈ సందర్భంగా ఆవిష్కరిస్తారని వారు పేర్కొన్నారు.

నేడు మండల సమావేశం

రాజుపాళెం : రాజుపాళెంలోని ఎంపీడీఓ సభా భవనంలో ఇన్‌చార్జి ఎంపీపీ ఎస్‌ఏ నారాయణరెడ్డి అధ్యక్షతన శుక్రవారం మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సయ్యదున్నీసా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, ఆయా శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

వాహనాల వేలం

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక ప్రాంతీయ రవాణాశాఖ కార్యాలయంలో ఆర్టీఓ సుశీల పర్యవేక్షణలో గురువారం వాహనాల బహిరంగ వేలం నిర్వహించారు. 19 తుక్కు వాహనాలను వేలం వేయగా రూ. 3.50 లక్షలు రవాణాశాఖకు ఆదాయం వచ్చినట్లు ఆర్టీఓ తెలిపారు. కార్యక్రమంలో ఏఓ కరిముల్లా, ఎంవీఐలు నారాయణనాయక్, వేణు, లక్ష్మీకర్, రామ్మోహన్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

ప్రొద్దుటూరు : పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ తరఫున పోటీ చేస్తున్న ఎంవీ రామచంద్రారెడ్డిని గెలిపించాలని అపుస్మా నాయకులు గురువారం పట్టణంలో ప్రచారం చేశారు. పలు ప్రైవేటు పాఠశాలలకు తిరిగి ఎంవీ రామచంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కరస్పాండెంట్లు, ఉపాధ్యాయులను వారు కోరారు. సంగమేశ్వర హైస్కూల్ కరస్పాండెంట్ శివచంద్రారెడ్డి, టీవీఆర్ హైస్కూల్ కరస్పాండెంట్ రమణారెడ్డిలను అపుస్మా నాయకులు దేవీప్రసాద్‌రెడ్డి, షఫీ అహ్మద్, విజయభాస్కర్ కలిసి రామచంద్రారెడ్డి విజయానికి కృషి చేయాలని తెలిపారు.

వాహనాల తనిఖీ



వాహనాలను తనిఖీ చేస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్

దువ్వూరు : మండల పరిధిలోని జొన్నవరం మెట్ట వద్ద జాతీయ రహదారిపై పలు వాహనాలను గురువారం ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీ చేసింది. ఈ సందర్భంగా స్క్వాడ్ అధికారులు సుబ్రహ్మణ్యం, అమరనాథరెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉన్నందున అక్రమంగా మద్యం, నగదు తరలించకూడదన్నారు. అలా తరలించిన వారిపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

లక్ష్మిపేటలో ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

చాపాడు : మండలంలోని లక్ష్మిపేట గ్రామ ప్రాథమిక పాఠశాలలో గురువారం మధ్యాహ్నం కడపకు చెందిన ఆర్థరైటిస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రజలందరికీ ఉచితంగా ఆర్థోపెడిక్ వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేశారు. ప్రముఖ వైద్యులు విద్యా సాగర్‌రెడ్డి, శ్రీలక్ష్మి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ రవిశంకర్, నిర్వాహకులు నాగమునిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

27న బండలాగుడు పోటీలు

చింతకొమ్మదిన్నె : తాడిగొట్ల సమీపంలోని చిన్నపల్లె యోగిశ్రీ నరసింహా స్వామి 215వ ఆరాధన సందర్భంగా ఈనెల 27న బండలాగుడు పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త గోసుల మునిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి బహుమతి రూ. 50 వేలు, రెండవ బహుమతి రూ.40 వేలు, మూడవ బహుమతి రూ.30 వేలు ఉంటుందన్నారు.

గడప గడపకు సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



సంక్షేమ బావుట బుక్‌లెట్ ఇస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ ప్రభుత్వం గడప గడపకు సంక్షేమ పథకాలను అందిస్తోందని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని కొత్తపల్లె గ్రామ పంచాయతీ లింగాపురంలో గురువారం ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. గతంలో ఏ ప్రభుత్వం ఇంత పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలను అందించలేదని అన్నారు. రాజకీయాల్లో బీసీలకు ప్రభుత్వం పెద్ద పీట వేసిందన్నారు. లింగాపురం గ్రామంలో మరో వైపున ఎమ్మెల్యే రాచమల్లు సతీమణి రాచమల్లు రమాదేవి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, ఎంపీపీ శేఖర్ యాదవ్, ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లేల ఝాన్సీరాణి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, కాకర్ల నాగేశ్వరెడ్డి, కొనిరెడ్డి హర్షవర్ధన్ రెడ్డి, కౌన్సిలర్లు గరిశపాటి లక్ష్మీదేవి, వరికూటి ఓబుళరెడ్డి, కోఆపరేటివ్ స్టోర్స్ అధ్యక్షురాలు గజ్జల కళావతి, లింగాపురం సొసైటీ చైర్మన్ తుపాకుల ప్రతాప్ రెడ్డి, పూసల కార్పొరేషన్ డైరెక్టర్ తుపాకుల వెంకటరమణ, ఎంపీటీసీ గోపాల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

గాడ్గే బాబా జీవితం ఆదర్శనీయం



గాడ్గేబాబా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

బద్వేలు అర్బన్ : సంఘసంస్కర్త, స్వచ్ఛభారత్ ఆద్యుడు సంత్‌గాడ్గే బాబా మహరాజ్ జీవితాన్ని ప్రతిఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని పూలే ఆశయ సాధన సమితి చైర్మన్ బి.గురుమూర్తి తెలిపారు. గాడ్గేబాబా 147వ జయంతి సందర్భంగా గురువారం స్థానిక పూలే ఆశయసాధన సమితి కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సమాజంలోని దురాచారాలను, మానసిక, శారీరక అసమానతలను తొలగించుటకు చీపురు చేతపట్టి ప్రతి గ్రామంలోని వీధులు, దేవాలయాలను ఊడ్చుతూ ప్రజలను మేల్కొల్పిన గొప్ప సంఘసంస్కర్త అని కొనియాడారు. తొలుత గాడ్గేబాబా చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో రజక సంఘం నాయకులు చిన్నసుబ్బయ్య, కృష్ణ, వెంకటసుబ్బయ్య, జనార్దన్, ఆవాజ్ కమిటీ నాయకులు అన్వర్‌బాషా, సత్తార్, పూలే అంబేడ్కర్ రాజ్యాధికార సమితి రాష్ట్ర నాయకులు పిచ్చయ్య, బీజేపీ నాయకులు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఇతరులకు అనుమతి ఇవ్వవద్దు



తహసీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న ఉపాధ్యాయులు

పోరుమామిళ్ల : రంగసముద్రం పంచాయతీలో నాలుగు సర్వేనెంబర్లలో టీచర్స్‌కాలనీకి కేటాయించిన భూమిలో ఇతరులకు అనుమతి లేదా పట్టాలు ఇవ్వరాదని గురువారం కాలనీ సొసైటీ అధ్యక్ష కార్యదర్శులు బాలసుబ్బయ్య, వీరయ్యలు ఉపాధ్యాయులు, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు భైరవప్రసాద్‌తో కలసి తహసీల్దారు విజయకుమారికి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొత్తం 36 ఎకరాల్లో 431 మంది ఉపాధ్యాయులకు 5 సెంట్ల చొప్పున 1982లో పట్టా ఇచ్చారని, అయితే కాలనీలో ఇండ్లు నిర్మించుకొనేందుకు తీవ్ర జాప్యం జరిగిందన్నారు. 2007లో సర్వే జరిపి, ప్లాట్లు చూపించడంతో చాలామంది ఇండ్లు నిర్మించుకొన్నారన్నారు. ఇదే సమయంలో కామన్‌పర్పస్ (పార్కు, గుడి, బడి) కొరకు ఎకరా అరవై సెంట్లు కేటాయించగా అందులో అభివృద్ధి చేయలేకపోయామని, ఇంతలోనే రెవెన్యూ అధికారులు ఆ స్థలం చదును చేసి ఇతరులకు ఇచ్చేందుకు ప్రయత్నించడం అన్యాయమన్నారు. టీచర్ల కాలనీ సొసైటీ కమిటీ ఆ స్థలం అభివృద్ధి చేసి అందరికీ ప్రయోజనం ఉండేలా చూస్తుందన్నారు. అందువల్ల కామన్ పర్పస్ కొరకు కేటాయించిన స్థలం ఇతరులకు ఇచ్చే ప్రయత్నం విరమించుకోవాలని వారు కోరుతూ తహసీల్దారుకు అందరం కలసి వినతిపత్రం ఇచ్చామన్నారు. కార్యక్రమం ఉపాధ్యాయసంఘ నాయకులు బాలరంగయ్య, వెంకటరమణయ్య, నాగేంద్ర, రవికుమార్, సుబ్రమణ్యం, కృష్ణమోహన్ పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డు ఆస్తులను పరిరక్షించాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : వక్ఫ్‌బోర్డు ఆస్తుల పరిరక్షణలో అధికారులు విఫలమయ్యారని ఇన్సాఫ్ జిల్లా కార్యదర్శి షరీఫ్ తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన మాట్లాడుతూ జిల్లాలో వక్ఫ్‌బోర్డు ఆస్తులను పరిరక్షించాలని అధికారులకు ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. ప్రొద్దుటూరు మండలంలోని కొత్తపల్లె గ్రామ పంచాయతీ మోడంపల్లెలో, చాపాడు మండలంలోని అల్లాడుపల్లె గ్రామాల పరిధిలో వక్ఫ్‌బోర్డు ఆస్తుల ఆక్రమణకు సంబంధించి పంచాయతీ కార్యదర్శి, తహసీల్దార్, జిల్లా వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్, ఆడిటర్లకు ఫిర్యాదు చేశామని తెలిపారు. రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ ఖాదర్ బాషా ప్రొద్దుటూరు పర్యటనకు వచ్చినప్పుడు ఆయనను కలిసి వినతి పత్రం ఇచ్చామన్నారు. వక్ఫ్‌బోర్డు స్థలాలు ఎక్కడున్నాయో సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఇన్సాఫ్ నాయకులు బాబా ఫక్రుద్దీన్, బాషా పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణాల లక్ష్యం పూర్తి చేయాలి

రాజుపాళెం : ఇంటి నిర్మాణాల లక్ష్యాన్ని ఆయా శాఖల అధికారులు పూర్తి చేయాలని ప్రొద్దుటూరు నియోజకవర్గ ప్రత్యేకాధికారి శ్రీనివాసులరెడ్డి అన్నారు. రాజుపాళెంలోని ఎంపీడీఓ సభా భవనంలో గురువారం సాయంత్రం పంచాయితీ కార్యదర్శులు, వీఆర్‌ఓలు, సచివాలయ ఉద్యోగులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలానికి 562 ఇళ్లు మంజూరయ్యాయని, అందులో 228 ఇళ్లు పూర్తయ్యాయన్నారు. వారానికి 27 పూర్తి చేయాలని, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పక్కా గృహాల నిర్మాణం వేగవంతం చేయాలని చెప్పారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి రాఘవేంద్ర కుమార్, తహసీల్దార్ ఇందిరారాణి, ఎంపీడీఓ సయ్యదున్నీసా, ఈఓపీఆర్డీ షాకీర్ అలీఖాన్, హౌసింగ్ ఏఈ శేఖర్, మండల ఇన్‌చార్జి ఆర్‌ఐ అశోక్, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో రక్తహీనత నివారణ



రక్తంలో హిమోగ్లోబిన్ శాతాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ కిరణ్

ప్రొద్దుటూరు క్రైం : పౌష్టికాహారం తీసుకోవడం వల్ల రక్తహీనతను నివారించవచ్చని ఆర్‌బీఎస్‌కే రాష్ట్ర పరిశీలకుడు డాక్టర్ కిరణ్ తెలిపారు. కల్లూరు పీహెచ్‌సీ పరిధిలోని కొత్తపల్లె విలేజ్ హెల్త్ క్లినిక్‌లో గురువారం గర్భిణులకు రక్తంలో హిమోగ్లోబిన్ శాతాన్ని పరీక్షించారు. ఈ కార్యక్రమాన్ని డాక్టర్ కిరణ్ సమక్షంలో నిర్వహించారు. రక్తహీనత ఎలా వస్తుంది, ఎలా నివారించాలి, పౌష్టికాహారం, వ్యాధినిరోధక టీకాలు, యోగా, ధ్యానం విశిష్టత గురించి వివరించారు. కార్యక్రమంలో కల్లూరు పీహెచ్‌సీ డాక్టర్ బి శివప్రసాద్‌రెడ్డి, ఎంపీహెచ్‌ఈఓ ఎం వెంకటేశ్వర్లు, మురళీకృష్ణ, కళావతి, ప్రశాంత్, ల్యాబ్ టెక్నీషియన్ సుధాకర్, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సరికొత్త పరిష్కార మార్గాలు అన్వేషించాలి

వైవీయూ వీసీ ఆచార్య జింకా రంగజనార్ధన




ట్రైనర్ కృష్ణభాస్కర్‌ను సన్మానిస్తున్న అధికారులు, హాజరైనవారు

వైవీయూ: సరికొత్త ఆలోచనలు చేస్తూ పరిష్కార మార్గాలు చూపేవారే ప్రపంచంలో ముందు వరుసలో నిలుస్తారని వైవీయూ వైస్ చాన్స్‌లర్ ఆచార్య జింకా రంగజనార్ధన పేర్కొన్నారు. గురువారం వైవీయూలో కెరీర్ గైడెన్స్ సెల్, ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో ఎంబీఏ, ఎంసీఏ విద్యార్థులకు ఒక్కరోజు వర్క్‌షాపును వీసీ ప్రారంభించి మాట్లాడారు. మనం ఎక్కడి నుంచి వచ్చాం.. కుటుంబ నేపథ్యం ఏంటి అనే ఆలోచనలు విడనాడి, ఏదైనా సాధించాలనే లక్ష్యంతో సాధన చేసి గమ్యం చేరుకోవాలన్నారు. విషయ పరిజ్ఞానంతో పాటు ఇంటర్వ్యూ బోర్డులో ప్రదర్శించాల్సిన నైపుణ్యాలకు సంబంధించిన అవగాహన అవసరమన్నారు. ప్రభావవంతమైన ఆలోచనలతో భవిష్యత్తులో పారిశ్రామికవేత్తలుగా రాణించాలని సూచించారు. ప్రిన్సిపాల్ ఆచార్య కె. కృష్ణారెడ్డి మాట్లాడుతూ మేధోపరమైన ఆలోచనలు జీవిత ఎదుగుదలకు ఉపయోగపడతాయన్నారు. జేసీఐ ఇంటర్నేషనల్ ట్రైనర్ కె. కృష్ణభాస్కర్ మాట్లాడుతూ వక్తగా తయారుకావడానికి ఆకట్టుకునే వ్యక్తిత్వం, హావభావాలు, విషయ పరిజ్ఞానం, భావవ్యక్తీకరణ ఈ నాలుగు అంశాలు ప్రతి ఒక్కరిలో ఉండాలన్నారు. వాటిని పాటించాల్సిన విధానాలను వివరించారు. ముగింపు సమావేశానికి వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య టి. శ్రీనివాస్ విచ్చేసి శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. మరో ట్రైనర్ డా. నూరి పారి, వర్క్‌షాపు కన్వీనర్ డా. కె. లలిత, డా. పి. సరిత, డా. వేపరాల లాజర్, డా. ఎస్.వి.సుబ్బారెడ్డి, డా. రెడ్డయ్య, డా. సునీత, డా. రవీంద్ర, డా. లక్ష్మీనరసింహ పాల్గొన్నారు.

మహిళల క్రికెట్‌లో చక్కటి అవకాశాలు

కడప స్పోర్ట్స్: మహిళా క్రికెట్‌లో రాణించే క్రీడాకారిణులకు చక్కటి అవకాశాలు ఉన్నాయని క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ వైఎస్‌ఆర్ డిస్ట్రిక్ట్ (సీఏవైడీ) ఉమన్ వింగ్ సమన్వయకర్త కె. విష్ణుమోహన్‌రావు పేర్కొన్నారు. గురువారం నగరంలోని వైఎస్ రాజారెడ్డి–ఏసీఏ క్రికెట్ మైదానంలో స్థానిక వికాస్ ఇంగ్లీషు మీడియం పాఠశాల విద్యార్థినులకు క్రికెట్‌పై అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా క్రికెట్‌లో మెలుకువలు నేర్పించారు. క్రికెట్ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రారంభమైన క్రైస్తవుల పవిత్ర రోజులు

కడప కల్చరల్ : దైవం సూచించిన మార్గంలో ఖచ్చితంగా పయనించే తపస్కాలం ప్రారంభమైంది. బుధవారం నుంచి ఈ పవిత్ర గడియలు, పవిత్రమైన రోజులు ప్రారంభమైనట్లు క్రైస్తవ విశ్వాసులు భావిస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా క్రైస్తవులు మార్చి 7వ తేది గుడ్‌ఫ్రైడే, ఆ మరుసటి శనివారం వరకు లెంట్ డేస్ (తపస్కాలాన్ని...దుఃఖ దినాలు) భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు. ఇందులో భాగంగా దానధర్మాలు చేస్తూ విలాసాలకు దూరంగా ఉంటూ నిరంతర ప్రార్థనలతో దేవునికి దగ్గరయ్యేందుకు విశ్వాసులు కృషి చేస్తారు. క్రీస్తును విశ్వసించే వారు ఆయన పాపుల రక్షణ కోసం పడిన కష్టాలను గుర్తు చేసుకోవాలని క్రైస్తవ ప్రముఖులు తెలుపుతున్నారు. ఈ తపస్కాలమంతా జిల్లాలోని అన్ని చర్చిలలో ప్రత్యేక ప్రార్థన కూడికలు, క్రైస్తవ సేవా సంస్థలు పలు చర్చిలలో వైద్య శిబిరాలు, సేవా కార్యక్రమాలు, శుభ శుక్రవారం రోజున రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేయనున్నారు. ఈ 40 రోజుల్లో విశ్వాసులు మద్యం, మాంసం జోలికి వెళ్లరు. ఎలాంటి శుభకార్యాలు నిర్వహించరు. వీలైనంత వరకు దేవుని ధ్యానంలో గడుపుతారు. ఈ పుణ్యకాలంలో విశ్వాసులంతా ఈ సేవా కార్యక్రమాలలో స్వచ్ఛందంగా పాల్గొనాలని పిలుపునిస్తున్నారు.

విద్య, జ్ఞానం ఉన్నత శిఖరాలకు సోపానాలు

సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్: విద్య, జ్ఞానం ఉన్నత శిఖరాలకు సోపానాలని ప్రతి విద్యార్థి కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి సూచించారు. గురువారం కడప మున్సిపల్ ఉర్దూ బాలికల ఉన్నత పాఠశాలను ఎంఈఓ పాలెం నారాయణతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన 10వ తరగతి పరీక్షలు రాసే విద్యార్థులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. అలాగే వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. సెక్టోరియల్ అధికారి దశరథరామిరెడ్డి, అసిస్టెంట్ సెక్టోరియల్ అధికారి ఇలియాస్, హెచ్‌ఎం జావిదాఖానం పాల్గొన్నారు.

కవయిత్రి మొల్ల జయంతిని నిర్వహించాలి

కడప ఎడ్యుకేషన్: మహా కవయిత్రి.. రామాయణ తొలి తెలుగు రచయిత్రి మొల్లమాంబ జయంతిని వచ్చే నెల 13వ తేదీ యోగివేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించాలని సాహితీపీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు విద్వాన్ గానుగపెంట హనుమంతరావు కోరారు. ఈ విషయమై గురువారం వైవీయూ వీసీ ఆచార్య జింకా రంగజనార్ధనను ఆయన చాంబర్‌లో కలిసి వినతిపత్రమిచ్చారు. స్పందించిన వీసీ తెలుగుశాఖతో సంప్రదించి జయంతిని విశ్వ విద్యాలయం పక్షాన నిర్వహిస్తామని హామీ ఇచ్చారు.

పాలిసెట్-2023కి ఉచిత శిక్షణ

కమలాపురం : స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 2023 పాలిసెట్‌కు ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పదవ తరగతి పరీక్షలు రాయబోయే విద్యార్థులంతా 2023 పాలిసెట్ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. తమ కళాశాలలోనే గతంలో ఎన్నడూ లేని విధంగా అత్యుత్తమ, అసాధారణ ఫ్యాకల్టీతో పాలిసెట్‌కు ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తు, కోర్సులు, సీట్ల వివరాలు తెలుసుకోవడానికి తమ కళాశాలలోనే హెల్ప్‌లైన్ సెంటర్ ఏర్పాటు చేశామన్నారు. నియోజకవర్గ పరిధిలోని విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పాలిసెట్ ప్రవేశ పరీక్షకు ఓసీ, బీసీ అభ్యర్థులు రూ.400, ఎస్సీ, ఎస్టీలు రూ.200 చెల్లించాల్సి ఉంటుందని ఆయన వివరించారు.

ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయండి

మండల సమావేశంలో ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

మైదుకూరు : మండలంలో జగనన్న పక్కా ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అన్నారు. మండల పరిషత్ సభాభవనంలో గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న ఇళ్ల నిర్మాణంపై హౌసింగ్ ఏఈ బ్రహ్మానందరెడ్డిని అడిగారు. మండలంలోని నంద్యాలంపేట, వనిపెంట, తవ్వపల్లె పంచాయతీల్లో ఇళ్ల నిర్మాణం బాగా జరుగుతోందని ఏఈ వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని ఉగాది నాటికి గృహప్రవేశ కార్యక్రమం నిర్వహించాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో ఉపాధి ఏపీఓ లక్ష్మినారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎంఈఓ పద్మలత, మండల పశువైద్యాధికారి సుధాకర్, విద్యుత్ ఏఈ రామభద్రయ్య, ఉద్యాన అధికారి రామకృష్ణ మాట్లాడారు. ఎంపీడీఓ కుళ్లాయమ్మ, జెడ్పీటీసీ ఎ.ప్రసన్న లక్ష్మి, వైస్ ఎంపీపీలు ఊటుకూరు రఘురామిరెడ్డి, చిన్నకొండమ్మ, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీమన్నారాయణరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ మూలె సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన వైఎస్సార్ యూత్ నాయకులు

మైదుకూరులో గురువారం ఖాజీపేటకు చెందిన వైఎస్సార్ యూత్ నాయకులు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డిని కలిశారు. నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే చేస్తున్న కృషిని చూసి తాము స్ఫూర్తి పొందినట్టు యూత్ నాయకులు ఎం.చెన్నారెడ్డి, మీసాల జయకృష్ణ సాగర్, పొన్నా నాగేంద్ర సాగర్, శ్రీకాంత్ సాగర్ పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. సగర సంఘం కార్యాలయానికి స్థలం కేటాయించేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

ఉపాధి పనులను వెంటనే మొదలు పెట్టండి

డ్వామా పీడీ యధుభూషన్‌రెడ్డి



సామాజిక తనిఖీ బహిరంగ సభలో మాట్లాడుతున్న పీడీ యదుభూషన్‌రెడ్డి

చాపాడు : వ్యవసాయ పనులు ముగిశాయని వెంటనే ఉపాధి కూలీల కోసం పనులు మొదలు పెట్టాలని ఉపాధి హామీ పథకం జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ యదుభూషన్‌రెడ్డి పేర్కొన్నారు. 2021 ఏప్రిల్ నుంచి 2022 మార్చి వరకు మండలంలోని మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రూ.8.19కోట్ల ఉపాధి పనులు జరిగాయి. ఇటీవల పనులపై జరిగిన సామాజిక తనిఖీ అనంతరం గురువారం స్థానిక స్త్రీ శక్తి భవనంలో బహిరంగ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ ఉపాధి పథకంలో కూలీల ద్వారా రూ.4.68 కోట్లు, మెటీరియల్ ద్వారా రూ.3.51 కోట్లు ఖర్చు చేశామన్నారు. ఉపాధి పనులతో పాటు పంచాయతీరాజ్ అనుసంధానంతో జరిగిన పనులలో రూ.9,94,830లకు సరైన రికార్డులు లేవని తనిఖీ సభ్యులు గుర్తించారని రికవరీకి ఆదేశించారు.

ఏప్రిల్ నుంచి మండలంలోని చెరువులను అమృత్ సరోవర్ కింద అభివృద్ధి చేయాలని ఆదేశించారు. మండలంలో జరుగుతున్న జగనన్న ఇళ్ల నిర్మాణాలను వేగవంతంగా చేపట్టాలన్నారు. ఇప్పటి వరకు ఇళ్లను మొదలుపెట్టని వారికి, మొదలుపెట్టి రెండు దాటిని వారికి నోటీసులు జారీ చేయాలన్నారు. మైదుకూరు నియోజకవర్గంలో జగనన్న ఇళ్ల నిర్మాణాల్లో చాపాడు మండలం ముందంజలో ఉందన్నారు. నిర్మాణంలో ఉన్న ప్రతి ఇంటికి బిల్లులు విడతలవారీగా అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ తెలిదేల లక్షుమయ్య, ఎంపీడీఓ శ్రీధర్ నాయుడు, ఉపాధి ఏపీఓ పద్మారాణి, పంచాయతీరాజ్ ఏఈ ఈశ్వరయ్య, హౌసింగ్ ఏఈ మహబూబ్ బాషా, ఏపీడీ శ్రీలక్ష్మి, అంబుడ్స్‌మెన్ సాంబశివారెడ్డి, క్వాలిటీ కంట్రోల్ ఈఈ విజయభాస్కర్, ఏఈఈ సుధాకర్, ఉపాధి ఈసీ ప్రియాంక, సామాజిక తనిఖీ సిబ్బంది, ఉపాధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్లోకి కొత్త యాక్టివా వాహనం



కస్టమర్‌కు స్మార్ట్ కీని అందచేస్తున్న మేనేజింగ్ డైరెక్టర్ ముమ్మిరెడ్డి మహేందర్‌రెడ్డి

ప్రొద్దుటూరు క్రైం : హోండా కంపెనీ నూతనంగా ప్రవేశపెట్టిన యాక్టీవా హెచ్ స్మార్ట్ వాహనాన్ని గురువారం మార్కెట్లోకి విడుదల చేశారు. ప్రొద్దుటూరులోని మైదుకూరు రోడ్డులో ఉన్న యంఆర్ హోండా షోరూంలో మేనేజింగ్ డైరెక్టర్ ముమ్మిరెడ్డి మహేందర్‌రెడ్డి నూతన వాహనాన్ని ఆవిష్కరించారు. మొదటి కస్టమర్ ఎస్ఎన్ ఫయాజ్‌అహ్మద్‌కు యాక్టివా స్మార్ట్ కీని అందచేశారు. కార్యక్రమంలో నరేందర్‌రెడ్డి, జీఎం సందీప్‌కుమార్, ఏజీఎం షేక్‌షావలి, ఎస్‌ఎం గోపినాథ్‌రెడ్డి, షోరూం సిబ్బంది, ఫైనాన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

ట్యాప్ అకాడమీకి అర్హత సాధించిన సీబీఐటీ విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో సీబీఐటీ ప్రిన్సిపాల్, డైరెక్టర్, సిబ్బంది

చాపాడు : సీబీఐటీ కాలేజీకి చెందిన చివరి సంవత్సరం విద్యార్థులకు గురువారం ట్యాప్ అకాడమీ ఆధ్వర్యంలో ఫైనలియర్ విద్యార్థులకు నిర్వహించిన రాత పరీక్షలో 95 విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో 23 మంది కమ్యూనికేషన్ స్కిల్స్ హెచ్‌ఆర్ రౌండ్‌కి ఎంపికయ్యారు. వీరిలో 9 మంది విద్యార్థులు వివిధ ఉద్యోగాలకు అర్హత సాధించారని కళాశాల కరస్పాండెంటు వి.జయచంద్రారెడ్డి తెలిపారు. తమ కాలేజీ ట్యాప్ అకాడమీకి ఎంపికవ్వడం పట్ల కళాశాల డైరెక్టర్ లోహిత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డా.జి.శ్రీనివాసులరెడ్డి, ప్లేస్‌మెంట్ ఆఫీసరు శ్రీధర్, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు.

రైతు పక్షపాతి ప్రభుత్వం

రాష్ట్ర వ్యవసాయ సలహాదారుడు తిరుపాల్‌రెడ్డి



కమలాపురంలో శనగలను పరిశీలిస్తున్న రాష్ట్ర వ్యవసాయ సలహాదారుడు తిరుపాల్‌రెడ్డి

కమలాపురం : వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతులను అన్ని దశల్లో ఆదుకుంటోందని, ఇది రైతు పక్షపాతి ప్రభుత్వం అని రాష్ట్ర వ్యవసాయ సలహాదారుడు తిరుపాల్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన కమలాపురం మార్కెట్ యార్డులో ఏపీ మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శనగల కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. రైతుల నుంచి సేకరిస్తున్న శనగలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు విత్తు నుంచి విక్రయం వరకు అన్ని దశల్లో ప్రభుత్వం ఆదుకుంటోందన్నారు. రైతులకు సకాలంలో విత్తనాలు, ఎరువులు, పురుగు మందులతో పాటు వ్యవసాయం చేయడానికి కావలసినవన్నీ అందిస్తోందన్నారు. అలాగే రైతులు పండించిన దిగుబడులు విక్రయించు కోవడంలో రైతులు నష్టపోకుండా బహిరంగ మార్కెట్ ధర కంటే అధిక ధర వెచ్చించి రైతుల ఉత్పత్తులు ప్రభుత్వం కొనుగోలు చేస్తోందన్నారు. రైతు భరోసా, ఉచిత ఇన్సూరెన్స్, బీమా అన్ని ఇస్తున్న ఏకైక ప్రభుత్వం జగనన్న ప్రభుత్వం మాత్రమేనన్నారు. ఇప్పటికీ ఈ–క్రాప్ బుకింగ్ చేసుకోని రైతులుంటే తక్షణం చేసుకోవాలని ఆయన సూచించారు. ప్రభుత్వ పథకాలు రైతులకు అందాలంటే ఈ–క్రాప్ బుకింగ్ తప్పని సరి అన్నారు. కాగా అక్కడున్న రైతులు శనగల కొనుగోలులో కొద్దిమేరకు నిబంధనలు సడలించేలా చర్యలు తీసుకోవాలని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. వర్షాలకు పంట కిందపడి గింజ నల్లగా మారడంతో 8–10 శాతం నల్లగింజ వచ్చిందని, నిబంధన ప్రకారం 4 శాతం నల్లగింజ ఉంటేనే దిగుబడులు తీసుకుంటున్నారని, మీరే మాకు న్యాయం చేయాలని రైతులు వేడుకున్నారు. దీనికి స్పందించిన ఆయన మార్క్‌ఫెడ్ అధికారులతో సెల్‌ఫోన్‌లో మాట్లాడారు. ఈ విషయాన్ని ప్రభుత్వం, నాఫెడ్ దృష్టికి తీసుకెళ్లి రైతులకు న్యాయం జరిగేలా చూస్తానన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ఒక సారి ఉత్పత్తులు కొనుగోలు చేసి రశీదు ఇస్తే ఆ సరుకు బాగాలేదని వెనక్కు వచ్చినా రైతుకు సంబంధం లేదని, డబ్బులు ఇస్తారని రైతులకు సూచించారు.

మద్దతు ధరతో రైతులకు ఎంతో ప్రయోజనం

ఎర్రగుంట్ల : రాష్ట్ర ప్రభుత్వం మార్క్‌ఫెడ్–నాఫెడ్ ఆధ్వర్యంలో బుడ్డ శనగ కనీస మద్దతు ధర కల్పిస్తుండటం వల్ల రైతులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ ప్రభుత్వ ప్రధాన సలహాదారుడు తిరుపాల్‌రెడ్డి తెలిపారు. గురువారం ఎర్రగుంట్ల పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో బుడ్డ శనగ కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. రాష్ట్ర సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు ఉపయోగపడే సంక్షేమ పథకాలను చాలా ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారన్నారు.